VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 24 మే 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక:306

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## లారీని ఢీకొట్టిన కారు..
# ఆరుగురి దుర్మరణం

**అతివేగం ఆరుగురి ప్రాణాలను బలిగొంది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై తాటిచెర్ల మోటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు.**

గిద్దలూరు :అతివేగం ఆరుగురి ప్రాణాలను బలిగొంది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై తాటిచెర్ల మోటు వద్ద శు క్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతులంతా బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందినవారు. పోలీసుల వివరాల మేరకు... బేస్తవారపేట వైపు నుంచి గ్రానైట్ లోడుతో వస్తున్న లారీని ఒంగోలు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో లారీ ముందు భాగంలో కారు ఇరుక్కుపోయి లారీతోపాటు కొద్ది దూరం ముందుకు రావడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.కుమార్తె శిరీష, కుమారుడు సిద్ధుతో కలిసి స్టూవర్టుపురానికి చెందిన గజ్జెల భవాని (22) ఇటీవల నంద్యాల జిల్లా డోన్‌కు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారిని తీసుకురావడానికి స్టూవర్టుపురం నుంచి గజ్జెల నరసింహ (22), కర్రెద్దుల దివాకర్ (26) గజ్జెల అంకాలు (45), బచ్చు సందీప్ (25), గజ్జెల బబ్బులు అలియాస్ జోసఫ్ (25) గురువారం సాయంత్రం కారులో డోన్‌కు వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. కారును దివాకర్ నడుపుతున్నారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నరసింహ, దివాకర్, అంకాలు, సందీప్, జోసఫ్, భవాని మృతిచెందారు. తల్లి భవానిని కోల్పోయిన నాలుగు, రెండేళ్ల చిన్నారులు శిరీష, సిద్ధు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు. వారి రోదనలు చూపరుల కంటతడి పెట్టించాయి.


# తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తా



**మరో 50 సార్లయినా ప్రధానిని కలుస్తాత్వరలో నిమ్జ్‌లో హ్యుందాయ్ కార్ల పరిశ్రమ జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

జహీరాబాద్‌రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిధుల కోసం అవసరమైతే ప్రధాని మోదీని మరో 50 సార్లు కలిసేందుకు సిద్ధమన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి రూ.494.67 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం జహీరాబాద్ పట్టణం పస్తాపూర్‌లో జరిగిన ప్రజాపాలన.. ప్రగతి బాట బహిరంగ సభలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని.. ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధే తనకు ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయన్నారు. కేంద్రంపై అలిగితే రాష్ట్రాలకే నష్టమని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతంతో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఉన్న అనుబంధం విడదీయలేనిదని సీఎం రేవంత్ అన్నారు. తుది శ్వాస వరకు ఆమె మెదక్ ఎంపీగా, ప్రధానిగా దేశానికి సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ నిర్లక్ష్యానికి గురైందని, అభివృద్ధి కుంటుపడిందని ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేసి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని భారీగా పెంచాం. భూములు ఇస్తున్న 5,612 మంది రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. త్వరలోనే బాధిత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ఇళ్ల మంజూరు పత్రాలు అందించే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా. త్వరలోనే నిమ్జ్‌కు హ్యుందాయ్ కార్ల పరిశ్రమ రాబోతోంది.

# బెంగుళూరులోనూ కరోనా కలకలం



బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులో ఓ తొమ్మిదేళ్ల చిన్నారికి కోవిడ్-19 పాజిటివ్ నిర్ధారణ అయిందని ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఆ చిన్నారికి మే 22న ర్యాపిడ్ యాంటీజెన్ టెస్ట్(ఆర్ఎటి) చేయగా పాజిటివ్ అని తెలిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి హర్ష్ గుప్తా వెల్లడించారు. 'రోగిని బెంగళూరులోని కలాసిపాల్యలోని వాణి విలాస్ హాస్పిటల్‌లో చేర్చాం. ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన పేర్కొన్నారు. బెంగళూరు రూరల్ జిల్లాలోని హాస్‌కోటెకు చెందింది ఆ చిన్నారి అని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కర్నాటకలో 16 కోవిడ్-19 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కర్నాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండు రావు మే 21న ధృవీకరించారు. కాగా ఇండియాలో మే 19 నాటికి మొత్తం 257 కోవిడ్19 యాక్టివ్ కేసులు ఉన్నట్లు- తేలింది.



మిస్ వరల్డ్ పోటీల్లో హెడ్ టు హెడ్ ఛాలెంజ్ సామాజిక సమస్యలపై స్పందించిన అదాల భామలు 72వ మిస్ వరల్డ్ పోటీల్లో కీలక భాగమైన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్ హైదరాబాద్‌లోని హోటల్ ట్రైడెంట్‌లో అట్టహాసంగా జరిగింది. ఆఫ్రికా, ఆసియా, ఓషియానియా, అమెరికా, కరేబియన్ నుంచి ఐదుగురు చొప్పన మొత్తం ఇరవై మంది అందగత్తెలు సామాజిక సమస్యలపై తమదైన శైలిలో స్పందించారు. తమ వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టు-కున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం



**ప్రపంచానికి మన సత్తాను చాటగలిగాం
ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తి లేదు
ఢిల్లీలో బిఎస్ఎఫ్ కార్యక్రమంలో అమిత్ షా**

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పడమే గాకుండా, భారత సైనిక శక్తి పాటవాన్నిప్రపంచానికి తెలియ చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారుదేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రయిక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది. ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తరవాత తగిన గుణపాఠం చెబుతామని ప్రదాని బీహార్‌లో ప్రకటించారని, అందుకు అనుగుణంగానే ఉగ్ర శిబిరాలపై దాడి చేశామని అన్నారు. కానీ పాక్ మాత్రం జనావాసాలు, విమాన స్థావరాలపై దాడులకు తెగించిందని అన్నారు.

# అవును నేనే లేఖ రాసా

**అయినా అది ఎలా లీకయ్యిందన్నదే ప్రశ్న**

**కెసిఆర్ దేవుడు...ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయి**

**ఉన్న విషయాలనే లేఖ ద్వారా తెలియ చేశా**

**ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు**

**'నేను నాకొడుకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ పూర్తి చేసుకుని అమెరికా నుంచి వెళ్లి వచ్చే లోపల మరేదో లేఖ లీకైందని చెప్పి గత రెండు మూడు రోజులుగా హంగామా జరుగుతున్నట్లు- తెలుస్తోంది.**



2లో..

# తెల్ల ఏనుగులా కాళేశ్వరం ప్రాజెక్ట్



**హైదరాబాద్:** కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. తప్పు చేయకుంటే నోటీసులు ఇచ్చినప్పుడు హాజరు కాకుండా అనవసర వాదనలు ఎందుకని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పూ చేయకుంటే నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు. బాంబులు వేశారని చెబుతున్నారు.

## కవిత లేఖపై స్పందించాల్సిన
# అసవరం లేదు

**డాడీ..డాటర్ వ్యవహారంతో మాకేం పని**

**కుటుంబ పార్టీలతో దేశానికి నష్టం: కిషన్ రెడ్డి**

**కుటుంబ పార్టీలు ప్రజల కొంపలు ముంచుతాయన్నారు. ఆ ఉత్తరం ఓ డ్రామా.. డాడీ డాటర్‌ల మధ్య మాటలు లేవని ఇప్పుడే తెలిసిందన్నారు. ఆ పార్టీ గురుంచి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.**



2లో..

# యధావిధిగా డిఎస్సీ, టెట్ పరీక్షలు

**షెడ్యూల్ వాయిదాను తిరస్కరించిన సుప్రీం**



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ, టెట్‌కు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే విడుదలైన డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా వేయాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని అభిప్రాయపడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఏవైనా సమస్యలు ఉంటే హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం సూచించింది. టెట్, డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేసింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు సీబీటీ- విధానంలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి హెచ్చరికలు..

తెలంగాణ: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అర్హులకు ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ఇళ్లలో గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 1.95 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించామని, మిగిలిన వారిని కూడా త్వరలో ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

తెలంగాణలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించనుంది. ఈ పథకం కోసం లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వీటిని నిశితంగా పరిశీలించి.. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అనర్హులకు



ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే.. వాటిని మంజూరు చేసిన అధికారులపైనే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవసరమైతే అలాంటి అదికారుల సర్వీసు రద్దు చేస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తే.. ముందుగా సదరు అధికారిని సస్పెండ్ చేస్తామని.. ఆ తర్వాత నిజనిర్ధారణ చేసి.. ఆరోపణలు వాస్తవమని తేలితే.. అలాంటి అధికారిని సర్వీస్ నుంచి రిమూవ్ చేస్తామని వెల్లడించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ లో మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం భూభారతి, ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. భూభారతి అమలుపై ప్రత్యేక నిఘా ఉంటుందని వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు సంబంధించి.. మూడు, నాలుగు దశల్లో క్రాస్ చెక్ చేసిన తర్వాతే అర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నామన్నారు. జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ఇండ్లలో గృహ ప్రవేశాలు చేసేలా వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా పొంగులేటి చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు 1.95 లక్షల లబ్ధిదారులను గుర్తించామన్నారు. మిగిలిన వారిని ఈ నెలాఖరు లోపు ఎంపిక చేస్తామని తెలిపారు. అలానే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అదనంగా 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 9,800 చెంచు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని, వాళ్లందరికీ ఇండ్లు ఇస్తామని మరోసారి ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఇబ్బంది పడిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి పథకం అమలు కింద పైలట్ మండలాలుగా ఎంపిక చేసిన వాటిల్లో వచ్చిన సమస్యల్లో.. కోర్టులో ఉన్నవాటిని తప్పించి మిగిలిన వాటిని జూన్ 2లోగా పరిష్కరిస్తామని తెలిపారు. అలానే రాష్ట్రంలో 413 గ్రామాలకు ఇప్పటి వరకు నక్షాలు, సర్వే రికార్డులు లేవని, వాటిలో ఐదింటిని పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి సర్వే చేయబోతున్నట్లు చెప్పారు.

# మెట్రో ఛార్జీలపై 10 శాతం డిస్కౌంట్..



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో టికెట్ ధరలను 20 శాతం పెంచిన తర్వాత ప్రయాణికుల నుండి వ్యతిరేకత రావడంతో, మెట్రో యాజమాన్యం 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. కనిష్ట ఛార్జీ రూ.11, గరిష్ట ఛార్జీ రూ.69గా నిర్ణయించారు. ఈ తగ్గింపు పేపర్, క్యూఆర్ టోకెన్, డిజిటల్ టికెట్లు, స్మార్ట్ కార్డులకు వర్తిస్తుందని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో కొన్ని రోజుల క్రితం టికెట్ ధరలను 20 శాతం పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. టికెట్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మెట్రో ధరలు తగ్గించకుంటే ట్రాఫిక్ పెరుగుతుందని తెలిపారు. ఇక ప్రయాణికుల అసహనం నేపథ్యంలో మెట్రో యాజమాన్యం దిగి వచ్చింది. పెంచిన ధరలపై 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. డిస్కౌంట్ ఎప్పుడైనా ఎత్తి వేసే అవకాశం ఉందని.. అందుకే మెట్రో ఛార్జీలపై డిస్కౌంట్ కాకుండా.. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా మెట్రో యాజమాన్యం..


మెట్రో కొన్ని రోజుల క్రితం టికెట్ ధరలను 20 శాతం పెంచి.. తాజాగా 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. దీంతో టికెట్ ధరలు మారాయి. పెంచిన ధరల ప్రకారం.. మెట్రోలో కనీస టికెట్ ఛార్జీలు రూ.10 నుంచి రూ.12లకు, గరిష్ట ఛార్జీ రూ.60 నుంచి 75కు పెరిగాయి. ఇప్పుడు పది శాతం డిస్కౌంట్‌తో కనిష్ట ఛార్జీ రూ.11, గరిష్ట ఛార్జీ రూ.69కి తగ్గింది. తగ్గిన ధరలు మే 24 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది.

**ఆ లేఖ కవిత రాయలేదా..?**

# మరి హ్యాండ్ రైటింగ్ సంగతేంటి?

తెలంగాణ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసీఆర్‌కు రాసినట్లుగా చెబుతున్న ఒక లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వరంగల్ సభ నిర్వహణ, బీజేపీపై విమర్శల తీవ్రత, భవిష్యత్ పొత్తు ప్రచారాలపై అసంతృప్తి, ప్లీనరీల నిర్వహణ ఆవశ్యకతను ఈ లేఖలో కవిత వ్యక్తం చేసినట్లు ఉంది. అయితే, లేఖలోని సంతకం కవితది కాదని బీఆర్ఎస్ నేతలు వాదిస్తుండగా, ఆమె పాత లేఖలతో చేతిరాతను పోల్చుతూ కొందరు ఇది నిజమైన లేఖే అని అంటున్నారు. మంత్రి కోమటిరెడ్డి ఈ లేఖను కేటీఆర్, హరీష్‌రావు రాశారని ఆరోపించారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసినట్లుగా చెబుతున్న ఒక లేఖ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ లేఖలోని అంశాలు బీఆర్ఎస్ పార్టీ అంతర్గత పరిస్థితులు, భవిష్యత్ వ్యూహాలపై తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వైరల్ అవుతున్న ఈ లేఖలో కవిత, వరంగల్‌లో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహణ తీరుపై ఆమె అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది.

అయితే ఈ లేఖ ప్రామాణికతపై బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తున్నారు. లేఖ చివరన ఉన్న సంతకం కవితది కాదని కొందరు బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నారు. దీనికి సంబంధించి ఆమె సంతకం చేసిన పాత లేఖ ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. బతుకమ్మను గూగుల్ డూడుల్‌గా ఫీచర్ చేయాల్సిందిగా కోరుతూ గూగుల్ ఇండియా





మేనేజింగ్ డైరెక్టర్‌కు రాసిన లేఖలో ఆమె ఒరిజినల్ సంతకం చేసిన ఆ రిక్వెస్ట్ లెటర్ ఒకటి కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ రెండింట్లో సంతకాలు వేరే విధంగా ఉండటంతో ఆ లేఖ కవిత రాసింది కాదంటూ బీఆర్ఎస్ నాయకులు వాదిస్తున్నారు. మరో పోస్ట్ లో.. "అన్నీ బానే చేశారుగానీ.. లాస్ట్ లో సంతకం పెట్టడం దగ్గర దొరికిపోయారు.. ఇలా అయితే కార్పొరేటర్ కూడా కాలేరు.. ఇది కవిత సంతకం కాదు" అంటూ ఓ పోస్ట్ వైరల్ అవుతోంది.

అంతే కాకుండా.. బీఆర్ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో ఒక మీమ్‌ను పోస్ట్ చేస్తూ.. "లెటర్ రాసినోడు ఎవడో కానీ, కవితక్క లెక్క సంతకం చేయడం మర్చిపోయాడని ఎద్దేవా చేశారు. వారు ఈ చర్యను 'వాడి ఫేక్ వార్తల సృష్టి – వాడి మానసిక నీచత్వానికి పరాకాష్ట' అంటూ తీవ్రంగా విమర్శించారు.

మరోవైపు.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత జైలుకు వెళ్ళిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ఎక్సైజ్ పాలసీతో ఎలాంటి ప్రమేయం లేదని రాసిన ఒక లేఖను కూడా కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆ లేఖలోని చేతి రాత, కేసీఆర్‌కు రాసినట్లుగా చెబుతున్న ఈ లేఖలోని చేతి రాత ఒకే విధంగా ఉన్నాయని కొందరు వాదిస్తున్నారు. ఇది కచ్చితంగా కవిత రాసిన లేఖే అని మరికొందరు చెప్పుకొస్తున్నారు.

ఇదిలా ఉండగా.. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ లేఖపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీష్‌రావు కలిసి కవిత పేరుతో ఈ లేఖను రాశారని.. ఆ లేఖకు, కవితకు సంబంధమే లేదని ఆయన ఆరోపించారు. ఈ లేఖ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని.. "ఆర్టిఫిషియల్ లేఖను కూడా సరిగా రాయలేకపోయారు" అని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కలుస్తుందని.. 20 లేదా 30 సీట్లలోనే బీఆర్ఎస్ పోటీ చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు.

> ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత జైలుకు వెళ్ళిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ఎక్సైజ్ పాలసీతో ఎలాంటి ప్రమేయం లేదని రాసిన ఒక లేఖను కూడా కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆ లేఖలోని చేతి రాత, కేసీఆర్‌కు రాసినట్లుగా చెబుతున్న ఈ లేఖలోని చేతి రాత ఒకే విధంగా ఉన్నాయని కొందరు వాదిస్తున్నారు. ఇది కచ్చితంగా కవిత రాసిన లేఖే అని మరికొందరు చెప్పుకొస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారంపై కల్వకుంట్ల కుటుంబం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వ్యాఖ్యలు చేయకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ పునర్నిర్మాణ దశలో ఉన్నందున.. ఇలాంటి అంతర్గత విశ్లేషణలు, వ్యూహాత్మక మార్పులు అత్యవసరమని భావిస్తున్నారు. ఈ లేఖలోని అంశాలు, అది నిజమైనా కాకపోయినా, బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న అంతర్గత చర్చలను.. భవిష్యత్ కార్యాచరణపై ఉన్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ వివాదంపై పూర్తి స్పష్టత రావాలంటే.. కల్వకుంట్ల కుటుంబం స్పందించాల్సిందే. అప్పటివరకు ఈ లేఖ తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగానే కొనసాగుతుంది.

# ప్రయాణికులకు అలర్ట్.. పలు రైళ్లు రద్దు..



తెలంగాణ: ఈ నెలలో రైలు ప్రయాణాలు బుక్ చేసుకున్నారా.. అయితే రైల్వే శాఖ మీకోసం కీలక అలర్ట్ ప్రకటించింది. ట్రాక్ మరమ్మతులు, లోకో షెడ్యూలింగ్, మహబూబాబాద్‌లో మూడో లైన్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసింది. ఖమ్మం మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను మే 2 నుంచి 29 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్ల మార్గాలను మళ్లించారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

వేసవి కాలం సెలవులు.. దానికితోడు ఈ నెలలో చాలా వరకు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఉన్నాయి. దీంతో చాలా మంది వెకేషన్స్, బంధువుల ఇళ్లకు వెళ్లడం, ఫంక్షన్స్‌కు హాజరు కావడం వంటి కార్యక్రమాలతో బిజీగా గడుపుతుంటారు. అయితే దూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు రైలు ప్రయాణానికే ఓటేస్తారు. తక్కువ ఖర్చుతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చని భావించి.. నెలల ముందుగానే ట్రైన్ టికెట్ బుక్ చేసుకుంటారు. మరి మీరు కూడా ఈ జాబితాలో ఉంటే.. రైల్వేశాఖ మీకోసం కీలక అప్డేట్ విడుదల చేసింది. పలు రైళ్లను రద్దు చేయడమే కాక కొన్నింటి మార్గం మళ్లించింది. మరి ఈ జాబితాలో మీరు వెళ్లాలనుకున్న రూట్ ఉందేమో చూసుకోండి.

రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పలు రైళ్లను రద్దు చేయడమే కాక.. కొన్నింటి మార్గాన్ని మళ్లించింది. అయితే ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం.. పలు చోట్ల ట్రాక్ మరమ్మతులు, లోకో షెడ్యూలింగ్, అలాగే మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న మూడో లైన్ పనులు. ఈ నేపథ్యంలోనే రైల్వే శాఖ రైళ్ల రద్దు నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి అనగా మే 23 నుంచి 29 వరకు ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

రైల్వే శాఖ నిర్ణయంతో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. రైళ్ల రద్దు నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకుని.. ప్రయాణికులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది. మరిన్ని వివరాలు కోసం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నేటి నుంచి అనగా మే 23 నుంచి 29 వరకు పలు రైళ్లను రద్దు చేశారు. ఆ వివరాలు..

**తెలుగు రాష్ట్రాల మధ్య రద్దైన రైళ్లు..**

- సికింద్రాబాద్-గుంటూరు (రైలు నం.12706)
- సికింద్రాబాద్-విజయవాడ (రైలు నం.12714)
- డోర్నకల్-విజయవాడ(రైలు నం.67767)
- విజయవాడ-భద్రాచలం రోడ్ (రైలు నం. 67215)
- గుంటూరు-సికింద్రాబాద్ (రైలు నం.12705)
- విజయవాడ-సికింద్రాబాద్ (రైలు నం.12713)
- విజయవాడ-డోర్నకల్ (రైలు నం.67768)
- భద్రాచలం రోడ్-విజయవాడ (రైలు నం.67216)
- ఇతర రద్దైన రైళ్ల వివరాలు..
- ఇండోర్-కొచ్చివెల్లి (రైలు నం.22645) ఈనెల 23న రద్దయ్యింది.
- కొచ్చివెల్లి-ఇండోర్ (రైలు నం.22646) 24న
- హిస్సార్-తిరుపతి (రైలు నం. 04717) 24న,
- గోరఖ్‌పూర్-కొచ్చివెల్లి (రైలు నం. 12511) ఈ నెల 23,25న
- గాంధీధామ్-విశాఖపట్నం (రైలు నం.20804) 25న
- తిరువనంతపురం-కోర్బా (రైలు నం. 22648) 26న,
- తిరుపతి-హిస్సార్ (రైలు నం.04718) 26న,
- సికింద్రాబాద్-తిరుపతి (రైలు నం. 07482) 26న
- కోర్బా-తిరువనంతపురం (రైలు నం. 22647) 28న,
- కొచ్చివెల్లి-గోరఖ్‌పూర్ (రైలు నం. 12512) మే 25, 27, 28న
- విశాఖపట్నం-న్యూఢిల్లీ (రైలు నం. 20805), 27, 28న
- న్యూఢిల్లీ-విశాఖపట్నం (రైలు నం.20806) 27, 28న రద్దు చేశారు.
- ఈరైళ్లను విజయవాడ-వరంగల్ మార్గంలో రద్దు చేసి.. దారి మళ్లించారు.

# హైకోర్టును ఆశ్రయించిన వైవీ సుబ్బారెడ్డి భార్య..

తెలంగాణ: అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నట్లు స్వర్ణలతారెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన జి.నర్సింహారెడ్డి, షేక్ ఇస్లాముద్దీన్, కొప్పుల మల్లారెడ్డి తమ భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై గతంలో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశామని.. అయినా వారు పట్టించుకోవడం లేదని ఆమె పిటిషన్‌లో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తులు తమ భూమిలోకి ప్రవేశించకుండా రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు.

బుధవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం.. కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంలో పిటిషనర్‌తో పాటు ప్రైవేటు ప్రతివాదుల వాదన విని రెండువారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.



అలానే దీని గురించి స్వర్ణలతా రెడ్డికి సమాచారం ఇవ్వాలని తెలిపింది. తదుపరి విచారణ జూన్ 23కు వాయిదా వేశారు.

ఈ వివాదంలో సీనియర్ కౌన్సిల్ వినోద్ కుమార్ దేశ్‌పాండే.. సర్వలతా రెడ్డి తరఫున వాదనలు వినిపించారు. సర్వే నంబర్ 87లో మొత్తం 8 ఎకరాల స్థలం ఉందని తెలిపారు. తన క్లైంట్ అక్కడ 2.08 ఎకరాల భూమిని.. అసలు యజమాని నుంచే కొనుగోలు చేసిందన్నారు. అంతేకాక ఆ భూమి తన క్లైంట్ పేరు మీద రిజిస్టర్ అయినట్లు రెవెన్యూ రికార్డ్‌లో ఎంట్రీలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ భూమి అక్రమ ఆక్రమణకు సంబంధించి పోలీసులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికి వారు సరైన చర్యలు తీసుకోలేదని ఆయన కోర్టుకు తెలిపారు.

ఈ భూమి విలువ రూ.200 కోట్లు అని తెలుస్తోంది. తమ పేరిటి ఉన్న ఈ భూమిని రాజకీయ పలుకుబడి ఉన్న ఎ.అనిల్‌రెడ్డి కబ్జా చేశారని గతంలోనే వైవీ స్వర్ణలతారెడ్డి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, భూమి తమదేనంటూ నర్సింహారెడ్డి అనే వ్యక్తి తరఫున ఆయన వాచ్‌మన్ ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇక తాజాగా ఇదే వివాదంపై స్వర్ణలతా రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

# సర్పంచ్ ఎన్నికలకు ముహూర్తం ఫిక్స్..

తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించినట్లు సమాచారం. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో మరో ఎన్నికల నగరా మోగనుంది. అదే స్థానిక సంస్థల ఎన్నికలు. ఎన్నికల తేదీని ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు. కానీ ఆశావాహులు మాత్రం వారి ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ఆకర్షించే కార్యక్రమాలు మొదలుపెట్టారు. మరో నెల, రెండు నెలల్లో నోటిఫికేషన్ వస్తుంది.. అప్పటి వరకు ఆగడం ఎందుకన్నట్లు.. ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయారు. ఇప్పటికే గ్రామాల్లో.. స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవుల వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. తాజాగా సర్పంచ్ ఎన్నికలపై కీలక అప్డేట్ వచ్చింది. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముహూర్తం ఫిక్స్ చేసింది.

తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు.. ఎప్పుడు జరుగుతాయి అనే దానిపై జనాల్లో ఆసక్తి నెలకొని ఉంది. ఎన్నికల తేదీ ఎప్పుడు ఫిక్స్ చేస్తారా అని అందరూ ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సర్పంచ్ ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినట్లు సమాచారం అందుతుంది. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో ఈ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు త్వరగా అమలు కావాలంటే సర్పంచులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో సర్పంచుల పదవి కాలం ముగిసింది. గ్రామాల్లో సర్పంచ్లకు అధికారులు లేకుండా పోయాయి. దీంతో పాలన ఎక్కడికక్కడ ఆగిపోయిందని తెలుస్తోంది. అందుకే వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి.. ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా అడుగులు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది.

# ర్యాపిడో సేవల విస్తరణ.. ఇకపై ఆ 11 పట్టణాల్లో కూడా



హైదరాబాద్: నగరంలో ప్రజాదరణ పొందిన ర్యాపిడో సేవలు తెలంగాణలోని పలు పట్టణాలకు విస్తరించనున్నాయి. సిద్దిపేట, నల్గొండతో సహా 11 నగరాల్లో త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇదిలా ఉండగా, ర్యాపిడో, ఓలా వంటి యాప్‌లు అడ్వాన్స్ టిప్ పేరుతో వినియోగదారులను ప్రోత్సహిస్తున్న విషయం వివాదాస్పదమైంది.

ప్రస్తుతం అన్ని ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్ ఆధారిత రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. సొంత వాహనాలు లేని వారు, డ్రైవింగ్ రాని వారు, అలానే బస్ స్టాపులు, రైల్వే స్టేషన్‌లకు దూరంగా ఉన్న వారు త్వరగా, సౌకర్యవంతంగా ప్రయాణం చేయడం కోసం ర్యాపిడో, ఉబర్ వంటి రైడింగ్ సేవలను వినియోగించుకుంటున్నారు. గతంలో హైదరాబాద్‌లో కేవలం క్యాబ్ సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ర్యాపిడో, ఉబర్ వంటివి రావడం వల్ల.. బైక్, ఆటో సర్వీసులు కూడా అందుబాటులోకి వచ్చాయి. నగరంలో వీటికి ఫుల్లు డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ర్యాపిడో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వ్యాప్తంగా సర్వీసులను విస్తరించేందుకు ముందుకు వచ్చింది.

> వినియోగదారులు.. క్యాబ్, ఆటో, బైక్ సేవల కోసం బుక్ చేసుకుంటే.. 'అడ్వాన్స్ టిప్' ఆఫర్ చేస్తారా.. అలా అయితే త్వరగా రైడ్ బుక్ అయ్యే అవకాశం ఉందంటూ వినియోగదారుల మొబైల్‌కు మెసేజ్ వస్తోంది. పైగా అడ్వాన్స్ టిప్ అంటూ భారీ మొత్తంలో చూపుతుంది. టిప్ ఇవ్వడానికి అంగీకరిస్తే.. త్వరగా రైడ్ బుక్ అవుతుందని తెలుపుతుంది. ఇలా అడ్వాన్స్ టిప్ చూపించి.. అది ఇస్తేనే రైడ్ త్వరగా బుక్ అవుతుందని చెప్పి.. టిప్ ఇచ్చేందుకు యూజర్‌ను బలవంతం చేస్తున్నాయి ఈ యాప్స్.

ర్యాపిడో తెలంగాణ వ్యాప్తంగా తన సేవలను విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే పలు నగరాల్లో రైడింగ్ సేవలను అందిస్తున్న సంస్థ.. తాజాగా తెలంగాణలోని మరో 11 పట్టణాలకు ఈ సేవలను విస్తరించనుంది. వీటిలో భువనగిరి, సూర్యాపేట, నల్గొండ, నిజామాబాద్, కొత్తగూడెం, ఆదిలాబాద్, రామగుండం, కామారెడ్డి, సిద్ధిపేట, మహబూబ్‌నగర్, సంగారెడ్డి వంటి పట్టణాల్లో.. త్వరలో ర్యాపిడో సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. వీటి ద్వారా ప్రయాణికులు అతి తక్కువ ధరకే బైక్, ఆటో సర్వీసులను బుక్ చేసుకోవచ్చని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇక తాజాగా రైడింగ్ యాప్స్ అయిన ర్యాపిడో, ఓలాకు సంబంధించి ఓ వివాదం నడుస్తోంది. అదే అడ్వాన్స్ టిప్ అంశం. వినియోగదారులు.. క్యాబ్, ఆటో, బైక్ సేవల కోసం బుక్ చేసుకుంటే.. 'అడ్వాన్స్ టిప్' ఆఫర్ చేస్తారా.. అలా అయితే త్వరగా రైడ్ బుక్ అయ్యే అవకాశం ఉందంటూ వినియోగదారుల మొబైల్‌కు మెసేజ్ వస్తోంది. పైగా అడ్వాన్స్ టిప్ అంటూ భారీ మొత్తంలో చూపుతుంది. టిప్ ఇవ్వడానికి అంగీకరిస్తే.. త్వరగా రైడ్ బుక్ అవుతుందని తెలుపుతుంది. ఇలా అడ్వాన్స్ టిప్ చూపించి.. అది ఇస్తేనే రైడ్ త్వరగా బుక్ అవుతుందని చెప్పి.. టిప్ ఇచ్చేందుకు యూజర్‌ను బలవంతం చేస్తున్నాయి ఈ యాప్స్. ఒక్కసారి టిప్ ఇస్తే దాన్ని వెనక్కి తీసుకునే అవకాశం లేదు. అయితే తాజాగా ఈ అంశం సీసీపీఏ దృష్టికి రావడంతో దీనిపై చర్యలకు రెడీ అయ్యింది. ఈ అంశంలో ఇప్పటికే ఉబర్‌కు నోటీసులు జారీ చేయగా.. తాజాగా ఓలా, ర్యాపిడోపైనా విచారణ ప్రారంభించింది. ఇవి కూడా అడ్వాన్స్ టిప్ వసూలు చేస్తున్నట్లు తెలిస్తే.. చర్యలు తప్పవని హెచ్చరించింది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## పర్యాటక శాఖ మాస్టర్ ప్లాన్!

# ఫ్లోటింగ్ రెస్టారెంట్.. కేబుల్ బ్రిడ్జి..



ఏపీ: వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని పర్యాటకులకు గమ్యస్థానంగా మార్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పర్యాటక రంగంలో పలు కీలకమైన ప్రాజెక్టులపై ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలోనే కృష్ణానదిలో ఫ్లోటింగ్ రెస్టారెంట్, విజయవాడ బెర్మ్ పార్క్ అభివృద్ధి, కోనసీమ బ్యాక్ వాటర్‌లో విలాసవంతమైన హౌస్ బోట్లు, పోలవరం, పట్టిసీమ మధ్య కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వంటి ప్రతిపాదనలను ఏపీ పర్యాటకశాఖ పరిశీలిస్తోంది. ఈ విషయాన్ని ఏపీ టూరిజం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. హోమ్‌స్టేల అభివృద్ధి వంటి వినూత్న కార్యక్రమాలతో సందర్శకులను ఏపీకి రప్పించేలా ఆలోచనలు చేస్తోంది. పొడవైన తీర ప్రాంతాన్ని, రాష్ట్రంలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలోనే మరో వార్త బయటకు వచ్చింది. కృష్ణా నదిలో తేలియాడే రెస్టారెంట్ ( ఫ్లోటింగ్ రెస్టారెంట్) నిర్మించే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

ఈ విషయాన్ని ఏపీ టూరిజం ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కోపల్లె మంతెన హెరిటేజ్‌లో జరిగిన కార్యక్రమంలో అజయ్ జైన్ గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెల్లడించారు.రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి నూతన పాలసీని తీసుకొచ్చామన్న అజయ్ జైన్.. అందులో భాగంగా ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు.

విజయవాడ వద్ద కృష్ణా నదిలో ఉన్న భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్కు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు పర్యాటకశాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. పర్యాటక రంగాన్ని గ్రోత్ ఇంజన్‌గా గుర్తించిన ఏపీ ప్రభుత్వం.. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే టాప్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా ఏపీని మార్చే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు. అందులో భాగంగానే పర్యాటక రంగానికి ఇండస్ట్రీ హోదా ఇచ్చామని.. అలాగే పలు ముఖ్యమైన ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు వివరిచారు. ఇండస్ట్రీ స్టేటస్ కింద పర్యాటక రంగానికి రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల కల్పన చేపట్టి పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు తెలిపారు. ఇక అతిథి దేవోభవ కాన్సెప్ట్ కింద హోమ్‌స్టేల ఏర్పాటుపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అజయ్ జైన్ వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1,842 హోంస్టేలు నడుస్తున్నాయని తెలిపారు. సెర్ప్, మెప్మా సిబ్బంది భాగస్వామ్యంతో కొన్ని పైలెట్ టూరిస్ట్ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 27 హోటల్స్ నిర్మాణం మొదలెట్టామని.. వీటితో 18 వేల మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో కృష్ణా నదిలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

విజయవాడలో బెర్మ్ పార్క్ అభివృద్ధితోపాటుగా.. కోనసీమ బ్యాక్ వాటర్‌లో హౌస్ బోట్లు ఏర్పాటు చేసే ఆలోచన కూడా చేస్తున్నట్లు చెప్పారు. భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్క్ ఏర్పాటు, పోలవరం, పట్టిసీమ మధ్య కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నట్లు ఏపీ టూరిజం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. కాకినాడ, సూర్యలంక, మైపాడు, రామాపురం బీచ్‌లకు బ్లూఫాగ్ గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిపారు.

> పర్యాటక రంగానికి ఇండస్ట్రీ హోదా ఇచ్చామని.. అలాగే పలు ముఖ్యమైన ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు వివరిచారు. ఇండస్ట్రీ స్టేటస్ కింద పర్యాటక రంగానికి రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల కల్పన చేపట్టి పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు తెలిపారు. ఇక అతిథి దేవోభవ కాన్సెప్ట్ కింద హోమ్‌స్టేల ఏర్పాటుపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అజయ్ జైన్ వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1,842 హోంస్టేలు నడుస్తున్నాయని తెలిపారు. సెర్ప్, మెప్మా సిబ్బంది భాగస్వామ్యంతో కొన్ని పైలెట్ టూరిస్ట్ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు తెలిపారు.

## ఏకంగా బస్సును ఎత్తుకెళ్లాడు..

తిరుపతి: ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హఠాత్తుగా మాయమైంది. చింతల చేను ప్రాంతంలో పార్క్ చేసిన బస్సును ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లడంతో కలకలం రేగింది. పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తుండగా ఊహించని ట్విస్ట్ ఎదురైంది. కడప జిల్లా ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదానికి గురైందని సమాచారం వచ్చింది.. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లారు. ఈ ప్రమాదంలో బస్సు ధ్వంసమైనట్లు గుర్తించారు.

నగరంలోని చింతల చేను ప్రాంతంలో పార్క్ చేసిన ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును పార్క్ చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి బస్సును ఎత్తుకెళ్లారు. బస్సు కనిపించకపోవడంతో డ్రైవర్ మేనేజర్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. బస్సును గాలిస్తున్న సమయంలో కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం ఘాట్ రోడ్డులో ఉన్నట్లు గుర్తించారు. చోరీ చేసిన బస్సుకు కడప – రాయచోటి ప్రధాన రహదారిలోని ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. కడప – రాయచోటి ఘాట్ రోడ్డులోని మలుపును తిప్పలేకపోవడంతో ప్రమాదం జరిగింది.. దీంతో ఆ బస్సును అక్కడే వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. చింతకొమ్మదిన్నె పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ బస్సు విలువ సుమారు రూ.1 కోటి 30 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. తిరుపతిలో జరిగిన ఈ బస్సు దొంగతనం ఘటన కలకలం రేపింది. గతంలో తిరుమలలో కూడా బస్సు దొంగతనం కలకలం రేపింది.. టీటీడీకి చెందిన ధర్మరథాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి గాలించగా.. తిరుపతికి సమీపంలోనే ఈ బస్సు మళ్లీ దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా తిరుపతిలో బస్సు చోరీ కావడం చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు ఆర్టీసీ సేవాలోపాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు చేయడంతో.. కలెక్టర్లు తరచూ తనిఖీ చేసి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలో

తిరుపతి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోలు, వాటికి అనుబంధంగా బస్టాండ్లు ఉన్నాయి.. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్డీవోలు, కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తనిఖీ చేసి అక్కడ ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆర్టీసీ అధికారులు కూడా అలర్ట్ అయ్యారు.

## కడపలో కొవిడ్ కేసు భయం..



కడప: ఏపీలో కొవిడ్ కేసు నమోదు కావటం కలకలం రేపుతోంది. విశాఖపట్నంలోని ఓ యువతికి కరోనా నిర్ధరణ అయ్యింది. అయితే ఆమె కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని అధికారులు తెలిపారు. మరోవైపు కడప జిల్లాలో కొవిడ్ కేసు నమోదైందంటూ శుక్రవారం వార్తలు వచ్చాయి. నంద్యాల జిల్లాకు చెందిన మహిళకు కొవిడ్ సోకిందని .. కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై కడప డీఎంహెచ్‌వో స్పందించారు.

దేశంలో కొవిడ్ కేసులు నమోదవుతూ ఉండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఏపీలోనూ కొవిడ్ కేసు నమోదైన సంగతి తెలిసిందే. విశాఖపట్నంలోని మద్దిలపాలెంకు చెందిన 23 ఏళ్ల యువతికి కొవిడ్ సోకిన సంగతి తెలిసిందే. అయితే కడప జిల్లాలో మరో కొవిడ్ కేసు నమోదైందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన ఓ మహిళకు కొవిడ్ సోకిందంటూ శుక్రవారం వార్తలు వచ్చాయి. ఆమెను కడపలోని రిమ్స్ ఆస్పత్రిలో ఐసోలేటెడ్ వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారంటూ ప్రచారం జరిగింది. కొన్ని రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతుంటే.. వైద్యులు పరీక్షలు నిర్వహించారని, ఈ పరీక్షల్లో ఆమెకు కొవిడ్ నిర్ధరణ అయ్యిందంటూ వార్తలు వచ్చాయి.

అయితే కడప జిల్లాలో కొవిడ్ కేసు నమోదు అయినట్లు జరుగుతున్న ప్రచారంపై కడప డీఎంహెచ్‌వో నాగరాజు స్పందించారు. కడప జిల్లాలో ఎలాంటి కొవిడ్ కేసు నమోదు కాలేదని క్లారిటీ ఇచ్చారు. రిమ్స్ ఆస్పత్రిలో చేరిన మహిళకు కొవిడ్ నిర్ధారణ కాలేదని స్పష్టంచ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు కరోనా కేసులు నమోదు కాలేదని కడప డీఎంహెచ్‌వో వెల్లడించారు. చాగలమర్రి మహిళ దగ్గు, జలుబు, జ్వరంతో కడప రిమ్స్‌కు వచ్చారని.. ఆమెకు ఊపిరితిత్తుల సమస్య మాత్రమే ఉందని క్లారిటీ ఇచ్చారు. అందుకే ఆమెను కోవిడ్ వార్డులో ఉంచి చికిత్స చేస్తున్నామని.. ఆమెకు కరోనా నిర్ధారణ కాలేదని క్లారిటీ ఇచ్చారు. కావున ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, వదంతులను నమ్మవద్దని కడప డీఎంహెచ్‌వో నాగరాజు సూచించారు.

మరోవైపు విశాఖపట్నంలో కరోనా కేసు నమోదైన సంగతి తెలిసిందే. మద్దిలపాలెంకు చెందిన యువతి స్థానికంగా ఉండే కార్పొరేట్ ఆసుపత్రిలో నాలుగు రోజుల కిందట జ్వరంతో చేరారు. అయితే వైద్యులు అనుమానంతో కరోనా నిర్ధారణ పరీక్ష చేయగా.. ఆ యువతికి పాజిటివ్ అని తేలింది. విశాఖ కేజీహెచ్ వైరాలజీ ల్యాబ్‌లోనూ ఈ నమూనాలను పరీక్షించగా.. అక్కడ కూడా కరోనా పాజిటివ్ అని నిర్ధారించారు. అయితే యువతి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే ఆమె ఎలాంటి ప్రయాణం చేయలేదని కుటుంబసభ్యులు చెప్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో కొవిడ్ కేసు నమోదు కావటంతో జాగ్రత్తలు పాటించాలని వైద్యారోగ్య శాఖ కోరింది. కొవిడ్ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో వేరుగా ఉండాలని సూచించింది. వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని.. ప్రయాణాల్లోనూ, జనసమ్మర్దంలో ఉన్నప్పుడు మాస్కులు ధరించాలని సూచించింది. కొవిడ్ కేసులు నమోదైన ప్రాంతాల నుంచి వచ్చినవారు ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే, తరచుగా చేతులు శుభ్రపరుచుకోవాలని వైద్యారోగ్య శాఖ సూచించింది.

## తిరుమలకు వెళ్లే భక్తులకు ముఖ్యగమనిక..




ఆంధ్రప్రదేశ్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని ప్రత్యేక రైళ్ల గడువును పొడిగించారు. అంతేకాదు, మరికొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించారు. విశాఖపట్నం–తిరుపతి, తిరుపతి–విశాఖపట్నం, విశాఖపట్నం–చర్లపల్లి రైళ్ల గడువు పొడిగించబడింది. వాల్తేర్ డివిజన్‌లో భద్రతాపరమైన పనుల కారణంగా కొన్ని రైళ్లు పాక్షికంగా రద్దు చేయబడ్డాయి. ప్రయాణికులు ఈ మార్పుల్ని గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రయాణికులకు ముఖ్య గమనిక.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని ప్రత్యేక రైళ్ల గడువును పొడిగించారు. అలాగే మరికొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించినట్లు.. వాల్తేర్ సీనియర్ డీసీఎం కె సందీప్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం–తిరుపతి, తిరుపతి–విశాఖపట్నం, విశాఖపట్నం–చర్లపల్లి, చర్లపల్లి–విశాఖపట్నం ప్రత్యేక రైళ్ల గడువును పొడిగించారు. వాల్తేర్ డివిజన్‌లో భద్రతాపరమైన ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున కొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించారు.

జూన్ 4 నుంచి జులై 30 వరకు విశాఖపట్నం–తిరుపతి ప్రత్యేక రైలు (08547) ప్రతి బుధవారం సాయంత్రం 7 గంటలకు విశాఖలో బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. జూన్ 5 నుంచి జులై 31 వరకు తిరుపతి–విశాఖపట్నం ప్రత్యేక రైలు (08548) ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు విశాఖకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు విశాఖపట్నంలో బయల్దేరి.. దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది.

అలాగే నరసాపురం–తిరుపతి మధ్య ప్రత్యేకంగా రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. జూన్, జులైలో ప్రతి ఆది, సోమవారాల్లో ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి.. 'ప్రతి ఆదివారం రాత్రి 10.20కు తిరుపతిలో 07131 నంబరుతో ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో సోమవారం సాయంత్రం 3.50కు 07132 నంబర్ నరసాపురంలో బయలుదేరి తెల్లవారుజాము 3.20కి తిరుపతి చేరుకుంటుంది. నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకులూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, వెంకటగిరి స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ స్పెషల్ రైళ్లు జులై 27 వరకు నడుస్తాయి' అని రైల్వే అధికారులు తెలిపారు.

మరోవైపు జూన్ 6 నుంచి జులై 25 వరకు విశాఖపట్నం–చర్లపల్లి రైలు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి.. మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. జూన్ 7 నుంచి జులై 26 వరకు ఈ చర్లపల్లి–విశాఖపట్నం రైలు ప్రతి శనివారం సాయంత్రం 7 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి.. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

మరోవైపు వాల్తేర్ డివిజన్‌లోని కేకే లైన్‌లో భద్రతాపరమైన ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా కొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించనున్నారు. విశాఖ–కిరండూల్–విశాఖ (58501–58502) రైళ్లు ఈనెల 26, జూన్ 2, 9 తేదీల్లో కొరాపుట్ వరకు మాత్రమే నడుస్తాయి.. కిరండూల్ వరకు వెళ్లవు.. కొరాపుట్‌లోనే ఆగిపోతాయి. భువనేశ్వర్–జగదల్‌పూర్ (18447), రూర్కెలా–జగదల్‌పూర్ (18107) రైళ్లు ఈనెల 25, జూన్ 1, 8 తేదీల్లో కొరాపుట్ వరకు నడుస్తాయి. జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448), జగదల్‌పూర్–రూర్కెలా (18108) రైళ్లు ఈనెల 26, జూన్ 2, 9 తేదీల్లో కొరాపుట్ వరకు మాత్రమే వెళతాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

## పండ్లతోటల సాగుపై రాయితీ పెంపుదల

గుంటూరు: వ్యవసాయ పంటలకు పెద్దగా దిగుబడి రావడం లేదు. ఆరుగాలం కష్టపడి చేసినా అంతగా ఆదాయం రావడం లేదు. కానీ ఉద్యాన పంటలు పెట్టిన వారికి అధికంగా ఆదాయం వస్తోంది. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం పండ్ల మొక్కల పంపిణీతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ, నీటి సరఫరా, మందులు, ఎరువలకు అయ్యే మొత్తాన్ని అందజేస్తోంది. ఇదంతా అందరికీ తెలిసిందే కాగా.. తాజాగా పండ్లతోటలు పండించే రైతులకు మరో శుభవార్త చెప్పింది. ముఖ్యంగా సాగు కోసం రాయితీని భారీగా పెంచింది.



విత్తులు వేసినప్పటి నుంచి కలుపు తీయడం, నీళ్లు పెట్టడం, ఎరువులు చల్లడం, తీరా పంట చేతికి వచ్చారా సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తెగ ఇబ్బంది పడుతున్నారు. ఆరుగాలం కష్టపడినా అంతగా ఆదాయం రాకపోవడంతో నరకం చూస్తున్నారు. కానీ ఉద్యాన పంటలు వేసిన వారు మాత్రం ఎక్కువగా పని చేయకుండానే అధికంగా లాభాలు పొందుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఏపీ సర్కారు పండ్ల మొక్కల పంపిణీతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ, నీటి సరఫరా, మందులు, ఎరువలకు అయ్యే మొత్తాన్ని అందజేస్తోంది. ఇదంతా అందరికీ తెలిసిందే కాగా.. తాజాగా పండ్లతోటలు పండించే రైతులకు మరో శుభవార్త చెప్పింది. ముఖ్యంగా సాగు కోసం రాయితీని భారీగా పెంచింది.

పండ్ల మొక్కల రైతులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సాయం చేస్తోంది. ఇప్పటికే పంపిణీతో పాటు నిర్వహణ, నీటి సరఫరా, మందులు, ఎరువులకు అయ్యే మొత్తాన్ని అందజేస్తోంది. అయితే మెట్ట



భూముల్లో పండ్ల తోటల సాగుకు గుంటూరు జిల్లాలోని అనుకూలమైన వాతావరణం ఉన్న కారణంగా ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగహన కల్పించి మరీ దరఖాస్తులు చేయిస్తున్నారు. పండ్లతోటల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా రాయితీని కూడా పెంచింది. గత 2024–2025 సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరమైన 2025–26లో ఉద్యాన సాగుకు రాయితీ సర్కారు భారీగా పెంచింది.

గతేడాది మామిడి తోటకు కేవలం ప్రభుత్వ రాయితీ రూ.13,300 ఉండగా.. ఈ సారి దాన్ని ఎకాఎకిన రూ.50 వేల వరకు పెంచేసింది. ఉపాధి హామీ కింద సాగు చేయాలనుకునే వారికి ప్రభుత్వం పండ్ల మొక్కలను ఇవ్వడమే కాకుండా రాయితీ నిధులను కూడా వంద శాతం వరకు మంజూరు చేస్తోంది. అయితే ఇవన్నీ పొందాలనుకుంటే ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎసలెలా దరఖాస్తు చేసుకోవాలంటే..? ఉపాధి హామీ కింద అయితే 5 ఎకరాల్లోపు సాగుభూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు అర్హులు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంప్రదిస్తే.. పండ్ల తోటల సాగుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసి మరీ దరఖాస్తు చేయిస్తారు.

అయితే ఈ విషయాలను నేరుగా ఉద్యానశాఖ జిల్లా అధికారి రమణారెడ్డి తెలిపారు. రైతులకు ఇది మంచి అవకాశం అని వివరించారు. వెంటనే ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఎక్కువగా మిరపను మాత్రమే పండిస్తున్నారని.. అలాంటి రైతుల పండ్ల తోటలవైపు మళ్లితే పెద్ద ఎత్తున లాభాలు పొందవచ్చని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ కింద సంపూర్ణ రాయితీతో ఉద్యాన సాగును చేసుకోవచ్చని రమణారెడ్డి ఆనంద వ్యక్తం చేశారు.



## విజయవాడకు మెట్రో.. 2 కోచ్‌లతో రైళ్లు..

విజయవాడ: మెట్రోను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రాథమిక ప్రణాళికలను రూపొందించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి మరీ.. ప్రణాళికలకు తుది రూపు తీసుకు వచ్చారు. అలాగే దీనిని ఆచరణలోకి తీసుకు వచ్చేందుకు గాను మెట్రో కార్పొరేషన్ అధికారులు రూ.205 కోట్లతో జనరల్ కన్సల్టింగ్ కంపెనీ కోసం టెండరును సైతం పిలిచారు. రెండు బోగీలతో రైళ్లను తాయరు చేయనున్నారు. అయితే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సేవలు కొనసాగించనున్నారు.

విజయవాడలో మెట్రోను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రాథమిక ప్రణాళికలను సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసిన మెట్రో రైలు కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలకు తుది రూపు తీసుకువచ్చారు. అలాగే దీనిని ఆచరణలోకి తీసుకువచ్చేందుకు గాను

> 25.90 కి.మీ మేర గన్నవరం విమానాశ్రయం నుంచి పీఎన్బీఎస్ వరకు ఒక కారిడార్, పెనమలూరు నుంచి పీఎన్బీఎస్ వరకు 12.50 కి.మీ మేర రెండో కారడార్ రానున్నాయి. ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ మెట్రో స్టేషన్లను వీలైనంతగా ఆర్టీసీ, విమానాశ్రయం, రైల్వేతో అనుసంధానం చేయనున్నారు.

మెట్రో కార్పొరేషన్ అధికారులు రూ.205 కోట్లతో జనరల్ కన్సల్టింగ్ కంపెనీ కోసం టెండరును సైతం పిలిచారు. దీంతో పాటు విజయవాడలో మెట్రో ప్రాజెక్టుకు ఇప్పటికే ఏఐఐబీ ఆసక్తి కనబరుస్తున్న విషయం తెలిసిందే. మెట్రో ప్రాజెక్టుకు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఈ అంశంలో చర్చలు సాగుతుండగా, కేంద్ర సర్కారు నుంచి అనుమతి లభించగానే ఖరారయ్యే వీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రయాణికుల సంఖ్య మేరకు.. ప్రతి రైలును మొదట రెండు బోగీలతోనే నడపనున్నారు. రెండు బోగీల్లో దాదాపు 500 మంది వరకు ప్రయాణించే వీలు ఉంటుంది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రద్దీ ఉన్న సమయాల్లో ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఈ మెట్రోను నడిపే అవకాశాలు ఉన్నాయి. ఉదయం 9–11, సాయంత్రం 5–7 గంటల ప్రాంతంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. అలాగే సెలవు రోజులు, ఆదివారాల్లో డిమాండ్ తక్కువగా ఉంటే సర్వీసులను కుదించనున్నారు.

నగరంలో రానున్న మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో రెండు కారిడార్లను నిర్మిస్తారు. 25.90 కి.మీ మేర గన్నవరం విమానాశ్రయం నుంచి పీఎన్బీఎస్ వరకు ఒక కారిడార్, పెనమలూరు నుంచి పీఎన్బీఎస్ వరకు 12.50 కి.మీ మేర రెండో కారడార్ రానున్నాయి. ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ మెట్రో స్టేషన్లను వీలైనంతగా ఆర్టీసీ, విమానాశ్రయం, రైల్వేతో అనుసంధానం చేయనున్నారు. ఈ మెట్రో స్టేషన్ల నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లేలా సిటీ బస్సులను నడపనున్నారు.

**మెట్రో స్టేషన్ల వద్ద ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు..**

ప్రతి మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించనున్నారు. దీంతో ఎక్కువ మంది మెట్రోను వినియోగించుకునే వీలు ఉంటుంది భావిస్తున్నారు. బహుళ ప్రయాణాల కోసం స్మార్ట్ కార్డులు, సింగిల్ జర్నీ కోసం క్యూఆర్‌తో కూడిన టికెట్లను జారీ చేస్తారు. రూపే, ఈఎంవీ కార్డులతో పాటు ఎన్ఎఫ్‌సీ ఆధారంగా పని చేసే మొబైల్ వ్యాలెట్ల ద్వారా కూడా టికెట్లు ఇవ్వనున్నారు. కేసరపల్లి, పీఎన్బీఎస్, పెనమలూరులో మెట్రో రైలు కోసం ప్రత్యేకంగా విద్యుత్తు సబ్ స్టేషన్లను నిర్మించనున్నారు.

## ఆలయానికి వెళ్లివస్తుండగా ప్రమాదం.. ఆరుగురు మృతి

ప్రకాశం: జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. బాపట్ల జిల్లా స్టూవర్టుపురం వాసులు మహానంది వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోయారు.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించారు. మరోవైపు చనిపోయిన వారిని బాపట్ల జిల్లా స్టూవర్టుపురం వాసులుగా గుర్తించారు. వీరంతా మహానంది ఆలయానికి వెళ్లి.. దర్శనం చేసుకుని.. తిరిగి ఊరికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ప్రమాదం జరిగిన సమయంలో కారులో 8 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. కారు, లారీ ఢీకొనటంతో వీరిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. వీరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే.. పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీసి.. పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.